
# మహిళలకు మొండి చేయి చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం

- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్
- మహాలక్ష్మి పథకం హామీని నెరవేర్చాలి
- మహిళలకు రూ.82,500 బకాయి: భగత్
- వృద్ధుల పింఛన్లపై కాంగ్రెస్ మాట తప్పింది
- కేసీఆర్ పాలనలో మహిళా సంక్షేమానికి పెద్దపీట
- కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిన సమయం: మాజీ ఎమ్మెల్యే భగత్










**గుర్రంపోడు, సెప్టెంబర్04 (నేటి దర్శిని):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గుర్రంపోడు మండల కేంద్రంలో శుక్రవారం మహిళా సదస్సు నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయినా ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

**మహిళలకు రూ.2,500 ఎక్కడ?**

మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చొప్పున అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని భగత్ తెలిపారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని ఆరోపించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని సుమారు 1.20 లక్షల మంది మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున 33 నెలలకు రూ.82,500 చొప్పున ప్రభుత్వం బకాయి పడిందని పేర్కొన్నారు.

**వృద్ధుల పింఛన్లపై విమర్శలు**

వృద్ధులకు నెలకు రూ.4,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటికీ ఆ హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని భగత్ విమర్శించారు. గత 33 నెలలకు సంబంధించి వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.66,000 చొప్పున ప్రభుత్వం బకాయి పడిందని ఆరోపించారు.

**తులం బంగారం హామీ ఏమైంది?**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద కేసీఆర్ ప్రభుత్వం అందించిన రూ.1,00,116కు అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని భగత్ గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు రాష్ట్రంలో కానీ, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కానీ ఏ ఒక్క మహిళకూ తులం బంగారం అందలేదని ఆరోపించారు. కేసీఆర్ కిట్ పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

**కేసీఆర్ పాలనలో మహిళా సంక్షేమం**

కేసీఆర్ పాలనలో మహిళలకు భరోసా, భద్రతతో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని భగత్ అన్నారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పలు పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. రూ.200గా ఉన్న పింఛన్‌ను రూ.2,000కు పెంచడం, పేదింటి ఆడపిల్లల



వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.1,00,116 అందించడం, తల్లి-బిడ్డల కోసం కేసీఆర్ కిట్ వంటి పథకాలను అమలు చేసినట్లు వివరించారు.

**కాంగ్రెస్‌ను గద్దె దించాలి**

కేసీఆర్ ప్రభుత్వం తల్లి, బిడ్డల సంక్షేమానికి కృషి చేస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేస్తోందని భగత్ ఆరోపించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మరోసారి ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే మహిళలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ రాంచందర్ నాయక్, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు, మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మన ఊరిని మన చెరువుని కాపాడడం మనందరి బాధ్యత





**ఆమనగల్లు, సెప్టెంబర్ 04(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని సుర సముద్రం చెరువుని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ ఇతర కౌన్సిలర్లతో కలిసి సుర సముద్రం చెరువు సందర్శించారు. చెరువులో కలుస్తున్న చెత్తాచెదారాన్ని పరిశీలించి మునిసిపాలిటీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ మాట్లాడుతూ మన చెరువును మనమే సుందరంగా తీర్చిదిద్దుకోవాలని, అందుకు మున్సిపాలిటీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని, మన ఊరు మన చెరువును మనమే కాపాడుకోవాలని,చికెన్,మటన్, చాపల వ్యర్థాలు,ఆసుపత్రుల సిరంజీలు,పగిలిపోయిన గాజులు, గాజు ముక్కలు,పాత బట్టలు, ఇలా చాలా వ్యర్థాలు మనమే పడేస్తున్నాం అని ఆయన అన్నారు. ఇవన్నీ వ్యర్థాలు చెరువులో పడేయకుండా మన ఇంటి దగ్గరికి వచ్చే మున్సిపాలిటీ ఆటోలో తడి చెత్త,పొడి చెత్తను,వేరు చేసి ఆటోలతో వచ్చే మున్సిపాలిటీ సిబ్బందికి ఇచ్చి ప్రజలు సహకరించాలని, దయచేసి శుభ్రతను పాటించి మన ఊరిని మన చెరువును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని చైర్మన్ పత్యా నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముక్తాల వెంకటయ్య,ఎర్రవోలు మహేష్, యనమల్ల రమేష్,మున్సిపాలిటీ సిబ్బంది రమేష్,రామకృష్ణ, పారిశుద్ధ్య కార్మికులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు పట్టణంలో ప్రజలను పట్టి పీడిస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్లు

**● ఆమనగల్లు డయాగ్నస్టిక్ సెంటర్లపై వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నియంత్రణ ఏది..?**

**ఆమనగల్లు,సెప్టెంబర్ 04(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో డయాగ్నస్టిక్ సెంటర్లు పరీక్షల ధరలు,నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ప్రజల వద్ద అధిక మొత్తంలో ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు క్లినిక్ లు డయాగ్నస్టిక్ సెంటర్లు ఏకమై(కుమ్మక్కై ) ప్రజలను పట్టిపీడిస్తున్నారు అనే అంశాలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.కొన్ని పరీక్షలకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉంటే,పరీక్షలు అవసరం లేకపోయినా వివిధ రకాల టెస్టులు చేపిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు.పరీక్షల రిపోర్టులు కచ్చితంగా ఎవరు పర్యవేక్షిస్తున్నారు..?




డయాగ్నస్టిక్ సెంటర్లకు అవసరమైన అనుమతులు,సాంకేతిక సిబ్బంది అర్హతలు,పరికరాల నిర్వహణ ప్రమాణాలు పాటిస్తున్నారా..? అనే ప్రశ్నలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.డయాగ్నస్టిక్ సెంటర్ లపై వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ధరల పట్టికను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, అనుమతులు,సిబ్బంది అర్హతలు, పరీక్షల నాణ్యత తదితర అంశాలను పరిశీలించి,వీటిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు,అధికారులను వేడుకుంటున్నారు.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# మిడ్జిల్ పీహెచ్‌సీలో రోగుల ప్రాణాలతో చెలగాటం

**● ప్రభుత్వ ఆసుపత్రులపై పర్యవేక్షణ ఏది..?**
**● మందుల కొరత, అపరిశుభ్రతపై మాజీ ఉప సర్పంచ్ పల్లె తిరుపతి ఆగ్రహం**




**మిడ్జిల్, సెప్టెంబర్ 04 (నేటి దర్శిని):** మిడ్జిల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కనీస వైద్య సదుపాయాలు అందడం లేదని, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..? మిడ్జిల్ మాజీ ఉప సర్పంచ్ పల్లె తిరుపతి ఆరోపించారు. పేద ప్రజలకు ఆధారమైన ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత, పారిశుధ్య లోపాలు నెలకొనడం ప్రభుత్వ వైద్య వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందని విమర్శించారు. పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వేముల శ్రీనివాసులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పల్లె తిరుపతి ఆరోపించారు. చికిత్స కోసం వచ్చే రోగులను పట్టించుకోకుండా ఫోన్‌లో నిమగ్నమవుతున్నారని పేర్కొన్నారు. అత్యవసర ప్రాథమిక చికిత్సకు అవసరమైన ఐయోడిన్‌తో పాటు ఇతర మందులు అందుబాటులో లేకపోవడంతో, పేద రోగులు బయట మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మరోవైపు ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్యం లోపించడంతో పాములు సంచరిస్తున్నాయని, రోగులు, వారి బంధువులు భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.




**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

మిడ్జిల్ పీహెచ్‌సీ పరిస్థితులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే తనిఖీ నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని పల్లె తిరుపతి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచడంతో పాటు పారిశుధ్య చర్యలు చేపట్టి రోగులకు భద్రమైన వాతావరణం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో పేదలకు కనీస వైద్యం అందుతుందా లేదా అనే విషయంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే గ్రామస్తులు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# బాలకృష్ణుడి సందడితో మురిసిన రైజ్ హారిజన్ కమ్యూనిటీ



**● కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..**
**● చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి**





**పటాన్‌చెరు, సెప్టెంబర్ 4 (నేటి దర్శిని):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్పూర్ మండల బాచుపల్లి రెణుకా ఎల్లమ్మ కాలనీలోని రైజ్ హారిజన్ కమ్యూనిటీలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలు, ఉత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి, సాంస్కృతిక కార్యక్రమాలతో కమ్యూనిటీ అంతా పండుగ శోభను సంతరించుకుంది. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని కమ్యూనిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి గీతాలు, కీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి వాతావరణం నెలకొంది. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధమ్మ వేషాల్లో ముద్దుముద్దుగా అలరించగా.. తల్లిదండ్రులు వారిని ప్రోత్సహిస్తూ ఆనందం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల ఆటపాటలు, మహిళల ఉత్సాహభరిత పాల్గొనడం, సభ్యుల సమిష్టి భాగస్వామ్యంతో వేడుకలు మరింత వైభవంగా సాగాయి. సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రతి పండుగను కమ్యూనిటీ సభ్యులంతా కలిసికట్టుగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో రైజ్ హారిజన్ కమ్యూనిటీ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీధర్ కీలక పాత్ర పోషించారు. భక్తి, ఐక్యత, ఆనందాల నడుమ శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి.

# పౌనూర్ గ్రామంలో ఉచిత దంత వైద్యశిబిరం

**జైపూర్, సెప్టెంబర్ 04 (నేటి దర్శిని):** జైపూర్ మండలం పౌన్నూరు గ్రామంలో తేది 04.09.2026 రోజున పౌనూర్ గ్రామపంచాయతీలో దంత వైద్య శిబిరాన్ని సర్పంచి వేముల సుధా తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు చేసి ప్రజలకు ఉచిత సేవ చేయడం జరిగింది. శ్రీకాంత్ దంత వైద్య యజమాన్యం ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని పౌనూర్ గ్రామంలో గల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈరోజున ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాలలో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, దీని ద్వారా గ్రామ ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని, తద్వారా ముందస్తుగా వ్యాధి నివారణ చర్యలు చేపట్టవచ్చు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. డా. సుమలత ఏం డి ఎస్,డా. కిరణ్మయి బి డి ఎస్ మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో సుమారు 100 మంది వరకు వైద్యపరీక్షలు చేయించుకున్నారని, వారికి తగు విధంగా మందులు పంపిణి చేశామని తెలిపారు.




# శ్రావణ శుక్రవారం సందర్భంగా అన్నపూర్ణాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు



**యాచారం ( సెప్టెంబర్ 04) (నేటి దర్శిని):** కొత్తపల్లిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో శుక్రవారం ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు.
శ్రావణ మాసంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాలే అనితా రమేష్, దేప విజయశ్రీ, మల్‌రెడ్డి వసుంధర, యాదమ్మ, పద్మ, స్వరూప, మంజుల, ప్రశాంతి, అలివేలు, ప్రభావతి, జస్విక తదితరలు పాల్గొన్నారు.


# శేరిలింగంపల్లిలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**- 84 బాధిత కుటుంబాలకు**
**రూ. 53,24,150/- ఆర్థిక సహాయం అందజేత**



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 04 (నేటి దర్శిని):** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 53,24,150/- యాభై మూడు లక్షల ఇరవై నాలుగు వేల నూట యాభై రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కుల ను 84 మంది బాధిత కుటుంబాలకు తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలియచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్ రావు, ఉరిటి వెంకట్ రావు,ఙా=ఖ ప్రసాద్, వీణ ఇబ్రహీం, జిల్లా గణేష్ , మారెళ్ళ శ్రీనివాస్,చంద్రమోహన్ సాగర్, అష్రఫ్, భాషా మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి జన్మదినం వేడుకలలో పాల్గొన్న గాంధీ



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 04 (నేటి దర్శిని):** శ్రీ కృష్ణాష్టమి పర్వదినంను పురస్కరించుకుని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్ కాలనీ లో గల ఇస్కాన్ టెంపుల్ లో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి జన్మదినం వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ .ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం ఈ భూమిపై అవతరించిన అవతార పురుషుడు శ్రీకృష్ణ భగవానుడి జన్మదినం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ, ప్రజాప్రతినిధులకుతాజ మాజీ కార్పొరేటర్లకు , నాయకులకు, కార్యకర్తలకు, పాత్రికేయ మిత్రులకు, అభిమానులకు, శ్రేయబిలాషులకు కృష్ణాష్టమి పర్వదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని తెలియచేశారు. కృష్ణ జన్మాష్టమి హిందూ ఇతిహాసాలలో శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం అని. కృష్ణ జన్మాష్టమిని కృష్ణాష్టమి అని లేదా జన్మాష్టమి లేదా గోకులాష్టమి అని కూడా పిలుస్తారు అని తెలియచేశారు. శ్రీకృష్ణుని ఆశీర్వాదం ,కృప కటాక్షం ఎల్లవేళలో ప్రజలందరి పై ఉండాలని కోరుకున్నాను అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయి నేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, వీణ ఇబ్రహీం, రాంచందర్, విద్య కల్పన ఏకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

